సాక్షి
శ్రీకాకుళం
శనివారం । 15 । జూన్ । 2024



పొట్టివైనా గట్టివే..

పొట్టి రకం మొక్కలపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. పొలం గట్లపై నాటుతున్నారు.

- 8లో



పట్టపగలు హత్యాయత్నం

శ్రీకాకుళంలో పట్టపగలు నడిరోడ్డుపై హత్యాయత్నం జరిగింది. ఓ యువకుడు కత్తితో కలకలం రేపాడు.

- 8లో

ఇన్‌చార్జి డీఎంహెచ్‌ఓగా ప్రసాదరావు

అరసవల్లి: జిల్లా ఇన్‌చార్జి వైద్యారోగ్య శాఖాధికారిగా డాక్టర్ మజ్జి ప్రసాదరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్ బొడ్డేపల్లి మీనాక్షి కొద్దిరోజుల పాటు సెలవులోకి వెళ్లిన కారణంగా అంతవరకు టెక్కలి డిప్యూటీ డీఎంహెచ్‌ఓగా పనిచేస్తున్న ప్రసాదరావు ఇన్‌చార్జి బాధ్యతలను నిర్వర్తించనున్నారు.

న్యూస్‌రీల్

పాలిటెక్నిక్ క్లాస్‌వర్క్ ప్రారంభం

ఎచ్చెర్ల క్యాంపస్: సాంకేతిక విద్యాశాఖ షెడ్యూల్ మేరకు పాలిటెక్నిక్ మొదటి ఏడాది క్లాస్‌వర్క్ శుక్రవారం ప్రారంభమైంది. పాలీసెట్ -2024 సీట్ల అలాట్‌మెంట్‌ను షెడ్యూల్ మేరకు గురువారం సాయంత్రం ప్రకటించారు. సీట్లు లభించిన విద్యార్థులు కళాశాలల్లో ఈనెల 19వ తేదీ లోపు చేరాల్సి ఉంటుంది. మొదటి విడత కౌన్సెలింగ్‌లో సీట్లు లభించిన విద్యార్థులు రెండో విడత కౌన్సెలింగ్‌లో కళాశాలలు, బ్రాంచ్‌లు మార్పు చేసుకోవచ్చు. సీటు రాని విద్యార్థులు మళ్లీ ఆప్షన్లు ఇచ్చుకోవచ్చు. కళాశాలల వారీగా జరిగిన ప్రవేశాలు పరిశీలిస్తే శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో 297 సీట్లకు 268, శ్రీకాకుళం ప్రభుత్వ మహిళల పాలిటెక్నిక్ కళాశాలలో 99 సీట్లకు 94, ఆమదాలవలస ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో 132కి 127, టెక్కలి ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో 118కి 98, సీతంపేట ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో 108కి 31, టెక్కలి ఐతం పాలిటెక్నిక్‌లో 462కి 361, ఎచ్చెర్ల శ్రీ వెంకటేశ్వర పాలిటెక్నిక్‌లో 462కి 340, చిలకపాలెంలోని శివానీ పాలిటెక్నిక్‌లో 330కి 56, శ్రీకాకుళం నారాయణ పాలిటెక్నిక్‌లో 396 మందికి గాను 40 ప్రవేశాలు జరిగాయి. త్వరలో రెండో విడత కౌన్సెలింగ్ నోటిఫికేషన్ విడుదలవుతుందని శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్, ప్రవేశాల ఇన్‌చార్జి జి.దామోదర్‌రావు వివరించారు. షెడ్యూల్ మేరకు ఈ నెల 19లోపు కళాశాలలకు రిపోర్టు చేయని విద్యార్థులు సీటు కోల్పోతారని తెలిపారు.

రేపటి నుంచి ముఖలింగేశ్వరుని కల్యాణోత్సవాలు



శ్రీముఖలింగేశ్వర ఆలయం

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం దక్షిణ కాశీ అయిన శ్రీముఖలింగేశ్వర స్వామి కల్యాణం ఈ నెల 16 నుంచి 21 వరకూ జరగనుందని ఈఓ పి.ప్రభాకరరావు శుక్రవారం తెలిపారు. 16న గణపతి పూజతో ప్రారంభించి ధ్వజారోహణ, బలిహరణ, 17న జ్యేష్ఠ శుద్ధ ఏకాదశి స్వామివారి తిరువీధి ఉత్సవం, పుట్టమన్ను తేవడం, శతమానం, మట్టెలు తీసుకొని రావడం, రాత్రి తొమ్మిది గంటలకు స్వామివారి కల్యాణం రాయబారం, పది గంటలకు స్వామి కల్యాణం ఔపాసన అనంతరం రాత్రి పార్వతీ పరమేశ్వరులకు నంది వాహనంపై తిరువీధి ఉత్సవం, 18న స్వామివారి అన్నదానం, ఔపాసన, బలిహరణ, 19న సదస్యం, పండిత సభ, రుగ్వేద పారాయణం, మహా మంత్రపుష్పం, హారతి, 20న దొంగ పెళ్లి మైనాకోత్సవం, 21న నాగవల్లి, స్వామివారి వసంతోత్సవం, అనంతరం పవిత్ర వంశధార నదిలో పుణ్య పవిత్ర స్నానాలు ఉంటాయని తెలిపారు.

వంశధార సర్కిల్ ఎస్‌ఈగా రాంబాబు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): బీఆర్‌ఆర్ వంశధార సర్కిల్ ఎస్‌ఈగా బి.రాంబాబును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటివరకు అదనపు బాధ్యతలు నిర్వహించిన తిరుమలరావుకు విశాఖపట్నం క్వాలిటీ కంట్రోల్ ఈఈగా పూర్తి బాధ్యతలు అప్పగించారు. రాంబాబు ఇప్పటివరకు ఏపీఎల్ఐపీగా కమిషనర్ కార్యాలయంలో విధులు నిర్వహించారు. వంశధార మెయిన్ కెనాల్ డివిజన్ టెక్కలి ఈఈగా బి.శేఖర్‌ని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ఇద్దరిపై 'పోక్సో' కేసు నమోదు

ఎచ్చెర్ల క్యాంపస్: తోటపాలెం పంచాయతీ దుప్పలవలసకు చెందిన ఇద్దరిపై శుక్రవారం ఎచ్చెర్ల పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. తనపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్నారని ఓ బాలిక పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆ ఫిర్యాదులో తన తల్లి పేరును కూడా చేర్చడం గమనార్హం. దీంతో పోలీసులు కేసు నమోదు చేశారు. పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తున్నారు.

తీరంలో హారంలా..





పూండి గల్లీ ప్రాంతంలో విస్తారంగా సాగవుతున్న ఉప్పు పంట (ఇన్‌సెట్లో) ఉప్పు మడుల్లో ఉప్పును సాగు చేస్తున్న రైతు

- ఈ ఏడాది 1.96 లక్షల మెట్రిక్ టన్నుల మేర ఉప్పు దిగుబడులు
- ప్రకాశం జిల్లా చినగంజాం తర్వాత శ్రీకాకుళంలోనే అధిక దిగుబడి
- జిల్లాలో 6400 ఎకరాల్లో ఉప్పు సాగు
- చివరి దశకు ఉప్పు సీజన్

వజ్రపుకొత్తూరు:

జిల్లాలో విశాల సముద్ర తీర ప్రాంతాన్ని ఆనుకుని విస్తారంగా కనిపించే ఉప్పుటేరులు ఉప్పు రైతులకు అన్నం పెడుతున్నాయి. రాష్ట్రంలో ఉప్పు పండించే ప్రాంతాల్లో ప్రకాశం జిల్లా చినగంజాం తర్వాత మన నౌపడ, పూండిగల్లీ ప్రాంతాలు రెండో స్థానంలో ఉన్నాయి. ఏటా సరాసరి 1.20 లక్షల మెట్రిక్ టన్నుల ఉప్పును ఒడిశా, పశ్చిమబెంగాల్ రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారు. ఇది అన్ని చోట్లా పండదు. దీనికి ప్రత్యేక భూస్వరూపం, నీళ్లు, వాతావరణ పరిస్థితులు ఉండాలి. మల్లె పువ్వులా మెరిసే నాణ్యత కలిగిన మన ఉప్పునకు దేశీయంగానే కాకుండా ఇతర దేశాల్లో మంచి గిరాకీ ఉంది. ఐతే వరుణుడి కరుణ తోడైతేనే రైతులకు సిరులు, లేకుంటే రైతులు నష్టాల బాట పడతారు. రాను రాను ఈ ప్రాంతంలో ఉప్పు పండే విస్తీర్ణం తగ్గుతోంది. కేంద్ర ప్రభుత్వ ప్రోత్సాహకం తగ్గడం, రైతులకు ఎలాంటి ఆర్థిక సహకారం లేకపోవడంతో రైతులకు పంట పండించడంపై ఆసక్తి సన్నగిల్లుతోంది.

ఏడాది	దేశీయ సాధారణ ఉప్పు (మెట్రిక్ టన్నులు వేలల్లో)	ఎగుమతి చేసిన ఉప్పు (మెట్రిక్ టన్నులు వేలల్లో)
2020	68.00	32.20
2021	72.00	28.25
2022	62.89	38.00
2023	52.20	48.50
2024	57.96	43.00

ఎండ మండితేనే..

ఉప్పు.. సాధారణ వ్యవసాయానికి చాలా భిన్నమైన పంట. సాధారణ పంటలకు వ్యవసాయానికి మంచినీరు కావాల్సి వస్తే ఇక్కడ ఉప్పు నీరు కావాలి. భిన్నమైన మట్టి సారం అవసరం. అన్నింటికీ మించి ఎండ మండితేనే పంట చేతికి వస్తుంది. ఫిబ్రవరి నుంచి జూన్ వరకు ఐదు నెలల పాటు శ్రమిస్తే తప్ప ఉప్పు పంట చేతికి రాదు. మడులు నిర్మించడం, పంటకు అనుకూలంగా మలచడం, భూ అంతర్భాగం నుంచి మోటార్లతో ఉప్పు నీరు తోడి అది 35 డిగ్రీల ఉప్పు గాఢత ఉందో లేదో చూడడం వంటి పనుల్లో రైతులు నిమగ్నం కావాలి. దీనికి అదే స్థాయిలో ఎండ తీవ్రత తోడైతే అప్పుడే పంట చేతికి వస్తుంది. ఇంతటి శ్రమలో వరుణుడు చిన్న చూపు చూశాడా.. పడిన కష్టం అంతా వర్షార్పణం కాక మానదు. అప్పుడు రైతులతో పాటు వ్యాపారులు నష్టాల్లోకి వెళతారు. ప్రస్తుతం ఉప్పు పంట చివరి దశకు చేరుకుంది. సంచుల్లో నింపడం వాటిని వ్యాపారులకు విక్రయించడం వంటి పనుల్లో రైతులు ఉన్నారు.



మర్రిపాడు వద్ద వ్యాన్‌లో లోడ్ చేస్తున్న ఉప్పు బస్తాలు

రికార్డు స్థాయిలో పంట

ఈ ఏడాది ఉప్పు రైతుకు కలిసివచ్చింది. పంట ఆశాజనకంగా ఉండడంతో రికార్డు స్థాయిలో దిగుబడులు వచ్చాయి. వరుసగా రెండేళ్లు అనుకూలించడంతో నష్టాల ఊబి నుంచి బయట పడ్డారు. వజ్రపుకొత్తూరు మండలం పూండి గల్లీ, కొండవూరులో 1270 ఎకరాలు, సంతబొమ్మాళి మండలం నౌపడ ప్రాంతంలో చిన్న మర్రిపాడు, శెలగపేట, సీతానగరం, పాలనాయుడుపేట, మూలపేట, లింగూడు, విష్ణుచక్రపురం గ్రామాల పరిధిలో 6400 ఎకరాల్లో 912 మంది రైతులు ఉప్పు సాగు చేస్తున్నారు. రెండున్నర సెంట్లు మడి(జమత్తు) నుంచి వారానికి 10 బస్తాల ఉప్పును పండిస్తారు. గడిచిన ఏడాది 1.25 లక్షల మెట్రిక్ టన్నుల ఉప్పు పండించగా ఈ ఏడాది అది 1.96 లక్షల మెట్రిక్ టన్నులకు చేరింది. 60 కిలోల బస్తా రూ.150 పలుకుతోంది. ఎగుమతులు దిగుమతులే కాకుండా ఇక్కడ పరోక్షంగా మరో 550 మంది కార్మికులకు ఉపాధి దొరుకుతోంది. రైతులు లీజు భూములతో పాటు కేంద్ర ప్రభుత్వానికి చెందిన భూములను లీజుకు తీసుకుని మరీ ఉప్పును పండిస్తున్నారు. నౌపడ, పూండి గల్లీ ప్రాంతాల్లో 1952 నుంచి ఈ ఉప్పు సాగు జరుగుతోంది.

ఆశాజనకంగా ఉంది



ఈ ఏడాది ఎండలు బాగా అనుకూలించడంతో ఉప్పు ఆశించిన మేర దిగుబడి వచ్చింది. ఐదు నెలల పాటు శ్రమిస్తే ఎకరాకు రూ.3 లక్షలు వరకు ఆదాయం వస్తుంది. ఐతే మధ్యలో కొంచెం వర్షం కురవడం వల్ల ఉప్పు నల్ల బారిపోయి నాణ్యత తగ్గింది. వర్షం వస్తే పంట అంతా నాశనం అవుతుంది. గడిచిన రెండేళ్లు బాగా పండింది. బరంపురం, కోల్‌కతా, పర్లాకిమిడి ప్రాంతాలకు చెందిన వ్యాపారులు 60 కిలోల బస్తా రూ.150 వరకు కొనుగోలు చేస్తారు. కొన్ని సార్లు ఉప్పు నాణ్యత తగ్గితే ధర రూ. 120ల వరకు పడిపోతుంది. ప్రభుత్వం రైతులను ఆదుకుని ప్రోత్సాహకాలు, రుణాలు అందించాలి. - బి.దానేసు, రైతు, శెలగపేట

రూ.60వేలు వరకు సంపాదిస్తాం



వేసవి సీజన్‌లో ఇంటిల్లిపాదీ కష్టపడతాం. ఈ ఏడాది పంట బాగుంది. మంచి దిగుబడులు వచ్చాయి. సంతోషంగా ఉంది. మడులు కట్టినప్పటి నుంచి ఉప్పు పండే వరకు ఎండలోనే మగ్గుతాం. ఐతే ఏటా ధరలు అనుకూలిస్తే నాకున్న పొలంలో అన్ని ఖర్చులు పోను సీజన్ రూ.60వేలు వరకు సంపాదిస్తాం. ఐతే పంట వర్షానికి తడిసిపోయి పాడైనపుడు వరి రైతులకు ఇచ్చే ఇన్‌పుట్ సబ్సిడీలా మా ఉప్పు రైతులకూ సహాయం చేసి ఆదుకోవాలి. మడులు కట్టుకునేందుకు ఆర్థిక సాయం చేయాలి. బ్యాంక్‌ల నుంచి పంట రుణాలు తక్కువ వడ్డీకి అందించాలి.

- బి.ఎర్రారావు, ఉప్పు రైతు, సీతానగరం

బుచ్చిపేట ఇసుక ర్యాంపులో ఐదు ట్రాక్టర్ల పట్టివేత

నరసన్నపేట: బుచ్చిపేట వద్ద వంశధార నదిలో అక్రమంగా ఇసుకను తవ్వి ట్రాక్టర్లలో తరలిస్తుండగా నరసన్నపేట ఎస్‌ఈబీ అధికారులు శుక్రవారం దాడి చేశారు. ఇసుకతో ఉన్న ఐదు ట్రాక్టర్లను పట్టుకున్నారు. వీటిని నరసన్నపేట పోలీసు స్టేషన్ ఆవరణకు తీసుకువచ్చారు. కేసు నమోదు చేసి ట్రాక్టర్లను సీజ్ చేసి పోలీసులకు అప్పగిస్తారని అందరూ భావించారు. కానీ అలా జరగలేదు. వచ్చిన ట్రాక్టర్లు వచ్చినట్టు వెళ్లిపోయాయి. విలేకరులకు కూడా పోలీసులకు ఈ వివరాలూ తెలుపలేదు. అధికార పార్టీ నాయకుల ఒత్తిడితోనే వాటిని విడిచి పెట్టారని సమాచారం. ఆమదాలవలస, టెక్కలి నియోజకవర్గాలకు చెందిన అధికార పార్టీ నాయకులు ఫోన్ చేయగా విడిచిపెట్టినట్టు తెలుస్తోంది. సెబ్ అధికారులు ఆరా తీసినా ఎవరూ స్పందించలేదు.



పోలీస్ స్టేషన్ వద్ద ట్రాక్టర్లు

'ఇసుక దాడులు ముమ్మరం చేస్తాం'

శ్రీకాకుళం క్రైమ్: నదుల్లో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న వాహనాలపై దాడులు మరింత ముమ్మరం చేస్తామని సెబ్ అదనపు ఎస్పీ డి.గంగాధరం హెచ్చరించారు. శుక్రవారం ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. జిల్లాలోని నరసన్నపేట, శ్రీకాకుళం సబ్ స్టేషన్ల పరిధిలో ఇసుకలోడ్లతో ఉన్న 22 లారీలు, 16 ట్రాక్టర్లు ఇటీవల పట్టుకున్నట్లు తెలిపారు. ఒక్కో లారీకి పది టన్నుల ఇసుక పట్టుకున్నట్లు పేర్కొన్నారు. మొత్తంగా 284 టన్నుల ఇసుకను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన నాటి నుంచి కోడ్ ముగిసిన వరకు మొత్తంగా 873 కేసులను 793 మందిపై పెట్టినట్లు పేర్కొన్నారు.

జిల్లా ఆర్చరీ క్రీడాకారుల ఎంపిక రేపు



శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా స్థాయి ఆర్చరీ క్రీడాకారుల ఎంపికలు ఈనెల 16వ తేదీన జరగనున్నాయని జిల్లా ఆర్చరీ అసోసియేషన్ శ్రీకాకుళం ప్రధాన కార్యదర్శి లోపింటి చిట్టిబాబు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. అరసవల్లి రోడ్‌లో ఉన్న ఆదిత్య ఆర్చరీ అకాడమీ వేదికగా ఆరోజు ఉదయం ఉదయం 8 గంటలకు ఈ ఎంపికలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. ఈనెల 22 నుంచి 24 తేదీల్లో ఏలూరు రోడ్, చుట్టగుంటలో ఉన్న శాతవాహన కళాశాల వేదికగా జరగనున్న ఏపీ రాష్ట్రస్థాయి అండర్-15, అండర్-13, అండర్-10 బాలబాలికల ఆర్చరీ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనే జిల్లా క్రీడాకారుల ఎంపికలు ఇక్కడ నిర్వహిస్తున్నట్టు చెప్పారు. అండర్-10 వయో విభాగానికి 2015 జనవరి ఒకటి తర్వాత, అండర్-13 వయో విభాగానికి 2012 జనవరి ఒకటి తర్వాత, అండర్-15 వయో విభాగానికి 2010 జనవరి ఒకటి తర్వాత జన్మించి ఉండాలని స్పష్టం చేశారు. ఈ ఎంపికల్లో పాల్గొనే క్రీడాకారులు జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు, 4 పాస్ ఫొటోలతో హాజరుకావాలని ఆయన కోరారు. అలాగే క్రీడాకారులు తమ ఎంట్రీ ఫీజుగా రూ.300 చెల్లించాల్సి ఉంటుందని సూచించారు. వివరాలకు 9440677201, 9989978727 నంబర్లను సంప్రదించాలన్నారు.

'డీఎస్సీకి ముందు టెట్ నిర్వహించాలి'

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్ర నూతన ముఖ్యమంత్రి డీఎస్సీ దస్త్రంపై మొదటి సంతకం చేయడం హర్షణీయమని, తొలుత టెట్ పరీక్షను నిర్వహించాలని ఏపీ ఇంటిలెక్చువల్స్ ఫోరం జోనల్ శాఖ అధ్యక్ష, కార్యదర్శులు సురంగి మోహనరావు, కోనే శ్రీధర్ శ్రీకాకుళం జిల్లా యూనిట్ అధ్యక్ష,కార్యదర్శులు బలివాడ మల్లేశ్వరరావు, పొట్నూరు వెంకటరావులు కోరారు. నిరుద్యోగ అభ్యర్థులను దృష్టిలో ఉంచుకుని ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)ను తొలుత నిర్వహించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులకు పనిభారం పెంచే ప్రభుత్వ ఉత్తర్వు సంఖ్య 117ను వెంటనే రద్దు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబుకి విజ్ఞప్తి చేశారు. జీఓ 117ని రద్దు చేయగా ఏర్పడే ఖాళీల సంఖ్యతో డీఎస్సీ పరీక్ష నిర్వహిస్తే నిరుద్యోగ ఉపాధ్యాయులకు న్యాయం జరుగుతుందని వారు పేర్కొన్నారు.

ప్రభుత్వ వైద్యుడి ఔదార్యం



రక్తదానం చేస్తున్న డాక్టర్ కూన మోహనబాబు

కాశీబుగ్గ: పలాస కిడ్నీ ఆస్పత్రిలో పనిచేస్తున్న డాక్టర్ కూన మోహనబాబు ప్రపంచ రక్తదాన దినోత్సవం సందర్భంగా రక్తం దానం చేశారు. ఆయన పలాస కిడ్నీ పరిశోధన కేంద్రంలో సీఆర్ఎంఓగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. కిడ్నీ బాధితుల కోసం రక్తదానం చేయడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

ఐటీఐ ప్రవేశాల కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదల

- 18 నుంచి 26వ తేదీ వరకు కౌన్సెలింగ్
- ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటీఐలో నిర్వహణ

ఎచ్చెర్ల క్యాంపస్: ఏడాది, రెండేళ్ల పారిశ్రామిక శిక్షణ కోర్సులు (ఐటీఐ)ల్లో ప్రవేశాలకు కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదలైంది. ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటీఐలో ఈ నెల 18వ తేదీ నుంచి 26వ తేదీ వరకు కౌన్సెలింగ్ నిర్వహించి సీట్లు కేటాయిస్తారు. జిల్లా నుంచి 2470 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. జిల్లాలో ఎచ్చెర్ల, శ్రీకాకుళం డీఎల్‌టీసీ, పలాస ప్రభుత్వ ఐటీఐల్లో 716 సీట్లు, 20 ప్రైవేట్ ఐటీఐల్లో 2892 సీట్లు ఉన్నాయి. రెండేళ్ల కోర్సులు ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, ఎలక్ట్రానిక్ మెకానికల్, ఇన్‌స్ట్రుమెంట్ మెకానికల్, డీజిల్ మెకానికల్, సివిల్ అండ్ డ్రాఫ్ట్‌మ్యాన్, ఏడాది కోర్సులు వెల్డర్, మెకానిక్ డీజిల్, కటింగ్ అండ్ సూయింగ్, కోపా ఉన్నాయి. విద్యార్థులు దరఖాస్తు సమయంలో అందజేసిన మొబైల్ నంబర్‌కు కౌన్సెలింగ్ సమయం, 10వ తరగతి మార్కులు బట్టి ఇచ్చిన ర్యాంకు వంటి వివరాల సంక్షిప్త సమాచారం చేరవేశారు. ఒరిజనల్ ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాల్సి ఉంటుంది. 10వ తరగతి మార్కులు, రిజర్వేషన్ రోస్టర్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు.

రోజూ రెండు షిఫ్టుల్లో కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. మొదటి షిఫ్టు ఉదయం 9 నుంచి 1 గంట వరకు, రెండో షిఫ్ట్ మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు నిర్వహిస్తారు.

తేదీ	మొదటి షిఫ్ట్ ర్యాంకు	గ్రేడ్	రెండో షిఫ్ట్ ర్యాంకు	గ్రేడ్
18	1-193	10.0-9.2	194-413	9.0-8.5
19	414-648	8.3-8.0	649-877	7.8-7.4
20	878-1144	7.3-7.0	1145-1399	6.8-6.1
21	1400-1642	6.3-6.0	1643-1873	5.8-4.3
22	1874-2083	5.3-5.0	2084-2305	4.8-4.3
23	2304-2470	4.2-1.2		



ఎచ్చెర్ల ఐటీఐ

హాజరు కాని, సీటు రాని విద్యార్థుల కోసం

తేదీ	ర్యాంకు (ఉదయం)	ర్యాంకు (మధ్యాహ్నం)
25	1-500	501-1000
26	1001-1600	1601-2470

షెడ్యూల్ మేరకు హాజరు కావాలి



విద్యార్థుల 10వ తరగతి మార్కులను బట్టి ర్యాంకు ఇచ్చాం. విద్యార్థులకు పూర్తి సమాచారం మెసేజ్ ఫోన్లకు పంపించాం. షెడ్యూల్ మేరకు ఒరిజనల్ ధ్రువీకరణ పత్రాలతో విద్యార్థులు హాజరు కావాల్సి ఉంటుంది. 10వ తరగతి మార్కులు, రిజర్వేషన్ రోస్టర్ ఆధారంగా పూర్తిగా పారదర్శకంగా ప్రవేశాల ప్రక్రియ ఉంటుంది. ఆన్‌లైన్‌లో ప్రవేశాల ప్రక్రియ నిర్వహిస్తాం.

- ఎల్.సుధాకర్‌రావు, శ్రీకాకుళం ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్, ప్రవేశాలు కన్వీనర్

మేఘ సందేశం

జిల్లాలో పలుచోట్ల శుక్రవారం ఈదురుగాలులతో కూడిన వర్షాలు పడ్డాయి. ఈదురుగాలుల ధాటికి పలు చోట్ల చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. జిల్లా కేంద్రంలో మబ్బులన్నీ కమ్మేసిన దృశ్యాలు ఆహ్లాదకరంగా కనిపించాయి.

- సాక్షి ఫొటోగ్రాఫర్, శ్రీకాకుళం



జిల్లా కేంద్రంలో ఈదురుగాలులు



శ్రీకాకుళం నగరంపై కమ్ముకున్న కారు మబ్బులు



శ్రీకాకుళంలో వాన



టెక్కలి: వీఆర్‌కే పురం వద్ద నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు

క్లుప్తంగా

జాబ్ మేళా రేపు

నరసన్నపేట: స్థానిక పద్మావతి డిగ్రీ కళాశాలలో ఈ నెల 16న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కళాశాల డైరెక్టర్ సీహెచ్ దుర్గాప్రసాద్ తెలిపారు. హెచ్ఆర్ రిక్రూట్‌మెంట్ ఏజెన్సీ ఈ జాబ్ మేళా నిర్వహిస్తుందని అన్నారు. ఐటీ, బ్యాంకింగ్, ఫార్మా, మేనేజ్‌మెంట్, రిటైల్ రంగాలకు చెందిన కంపెనీలు పాల్గొంటాయని ఆయన తెలిపారు.

'అకడమిక్ ఏడాది గాడిలో పడాలి'

ఎచ్చెర్ల క్యాంపస్: డిగ్రీ, పీజీ, లా, బీఎడ్ ఇలా అన్ని కోర్సుల అకడమిక్ విద్యా సంవత్సరం గాడిన పడాలని ఉన్నత విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి శ్యామలరావు తెలిపారు. వర్చువల్‌గా అన్ని విశ్వవిద్యాలయాల అధికారులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం వీసీ కేఆర్ రజిని, రిజిస్ట్రార్ పీలా సుజాత, ప్రిన్సిపాళ్లు ఈ సమావేశంలో పాల్గొన్నారు. జూలై ఒకటి నాటికి వర్సిటీ పరిధిలోని డిగ్రీ, పీజీ, లా, బీఎడ్, బీపీఈడీ, డీపీఈడీ ఇతర వృత్తి విద్యా కళాశాలల గుర్తింపు పరిశీలన పూర్తి చేయాలని సూచించారు. అఫిలియేషన్ బృందాలు ఏర్పాటు చేసి అర్హత ఉన్న కళాశాలలకు గుర్తింపు మంజూరు చేయాలని తెలిపారు. ఇంజినీరింగ్‌తో పాటు అన్ని కోర్సుల ప్రవేశాల షెడ్యూల్ జూలై ఒకటి తర్వాత విడుదల చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అన్నారు. ప్రవేశాల్లో జాప్యం అడ్మిషన్ల మీద పడుతుందని, కొన్ని కోర్సుల్లో కనీస ప్రవేశాలు జరగడం లేదని, విద్యార్థులు నచ్చిన కోర్సుల్లో చేరాలన్నా సాధ్యం కావడం లేదని అన్నారు. ప్రస్తుతం అకడమిక్ ఏడాది గాడిన పెట్టే ప్రయత్నం ముందుకు జరగాలని సూచించారు.

శిలాఫలకం ధ్వంసం



ధ్వంసమైన శిలాఫలకం

సారవకోట: మండలంలోని వడ్డినవలస గ్రామంలో గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు శిలాఫలకాన్ని ధ్వంసం చేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో వడ్డినవలస నుంచి జలుమూరు మండలంలోని కొమనాపల్లి వెళ్లే రోడ్డు విస్తరణ పనులకు అప్పుడు రెవెన్యూ శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహించిన ధర్మాన కృష్ణదాస్ శిలాఫలకం వేశారు. ఆ శిలాఫలకాన్ని గురువారం గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. శిలాఫలకం ధ్వంసం చేసిన విషయాన్ని వైఎస్సార్ పార్టీ నాయకులు పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు.

డివైడర్‌ను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు



ప్రమాదానికి గురైన బస్సు

నరసన్నపేట: జాతీయ రహదారిపై మడపాం టోల్‌గేట్ వద్ద శుక్రవారం సాయంత్రం ఆర్టీసీ బస్సు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఘటనలో ఆరుగురు గాయపడ్డారు. వీరిలో పోలాకికి చెందిన వి.విజయ దుర్గారావుకు తీవ్ర గాయమైంది. మిగిలిన ఐదుగురికి స్వల్ప గాయాలు కాగా ఎస్‌హెచ్ అంబులెన్స్ సిబ్బంది తక్షణమే స్పందించి ప్రథమ చికిత్స చేసి పంపారు. విశాఖ వన్ డిపోకు చెందిన ఈ ఆర్టీసీ బస్సు విశాఖ నుంచి ఇచ్ఛాపురం వెళ్తోంది. మడపాం టోల్‌గేట్ వద్దకు వచ్చే సరికి బస్ ముందు టైర్ పంక్చర్ కావడంతో అదుపు తప్పి టోల్‌గేట్ వద్ద డివైడర్‌ను ఢీకొట్టింది. ప్రమాద సమయంలో బస్సులో 32 మందితో పాటు డ్రైవర్‌కమ్ కండక్టర్ రవికుమార్ ఉన్నారు. బస్సు ముందు భాగం దెబ్బతింది.

రైలు ప్రమాదంలో తాపీ మేస్త్రి మృతి



రైలు ప్రమాదంలో మృతి చెందిన తాపీమేస్త్రి రాళోసాహి

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం రైలు నిలయం సమీపంలో శుక్రవారం జరిగిన రైలు ప్రమాదంలో తాపీ మేస్త్రి మృతి చెందినట్లు జీఆర్‌పీలు తెలిపారు. వివరాల్లోకి వెళితే.. స్థానిక రైలు నిలయం సమీపంలో ఎర్రచెరువు వద్ద బరంపురం వైపు వెళ్లే డౌన్ ట్రాక్‌లో గుర్తు తెలియని రైలు ఢీకొట్టడంతో ఒడిశాలోని నువగాం, రామచంద్ర ఖజూరియా గ్రామానికి చెందిన రాళోసాహి (45) అనే వ్యక్తి మృతి చెందినట్లు జీఆర్‌పీ సిబ్బంది గుర్తించారు. మృతుడు రైలు పట్టాలు దాటుతుండగా ప్రమాదం సంభవించి ఉంటుందని జీఆర్‌పీలు తెలిపారు. పూర్తివివరాలు సేకరించిన ఆర్‌పీఎఫ్ ఎస్ఐ ఎస్‌కే షరీఫ్ కేసు నమోదు చేసి మృతదేహాన్ని పలాస ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

నడక యాతన



జిల్లా కేంద్రంలో ఉన్న రిమ్స్ ఆస్పత్రిలో లిఫ్ట్ పనిచేయకపోవడంతో రోగులు, వారి సహాయకులు ఇబ్బంది పడుతున్నారు. మెట్ల మార్గం ద్వారా వెళ్లలేక అవస్థలు పడుతున్నారు. ఆస్పత్రి అధికారులు సత్వరం స్పందించి లిఫ్ట్‌ను బాగు చేయాలని కోరుతున్నారు.
– సాక్షి ఫొటోగ్రాఫర్, శ్రీకాకుళం









పొట్టివైనా గట్టివే..!



తక్కువ ఎత్తులో కాపునిచ్చే బొప్పాయి (ఇన్‌సెట్లో) మూడు అడుగుల ఎత్తులో కాపునిచ్చే అరటి



- పొట్టి రకాల మొక్కల సాగుకు ప్రాధాన్యత
- నాటిన ఏడాదికే ఫలసాయం
- పొలం గట్లపైన పండ్ల మొక్కల సాగు
- పెరటి మొక్కల సాగుకు ప్రాధాన్యత
- జిల్లాలో ఆసక్తి చూపుతున్న అన్ని వర్గాల వారు

ఎల్ఎన్ పేట:

మూడు అడుగుల అరటి చెట్టు.. చేతికి అందేంత ఎత్తులో సపోటా చెట్టు.. బుల్లి మామిడి చెట్టు నిండా పూత.. తలచుకుంటేనే ఆశ్చర్యంగా ఉంది కదా. రైతులు ఈ తరహా పొట్టి రకం చెట్ల పెంపకంపై ఇష్టం పెంచుకుంటున్నారు. పెద్దగా స్థలం అవసరం లేకపోవడం, నాటిన ఏడాదికే ఫలసాయం వస్తుండడంతో పొలం గట్లపైన ఈ రకం సాగు చేసేందుకు మక్కువ చూపుతున్నారు. పొట్టి రకాల (హైబ్రీడ్) మొక్కలకు గట్టి భవిష్యత్ ఉందని భావించిన నర్సరీ యజమానులు వాటినే అధికంగా విక్రయిస్తున్నారు. గత కొన్నేళ్లుగా అటవీ శాఖ, ఉపాధి హామీ పథకం ద్వారా అధికారులు పొట్టి రకాల మొక్కలను రైతులకు పంపిణీ చేస్తున్నారు. కొన్ని జాతులకు చెందిన మొక్కలు నాటిన ఆరు నెలల నుంచి కాపునివ్వటంతో ఆయా రకాల మొక్కల పెంపకం పెరుగుతోంది.

పొట్టి రకాల మొక్కలివే..

పొట్టి రకాల మొక్కల పెంపకానికి ప్రాధాన్యత ఇచ్చే వాటిలో జామ, మామిడి, సపోటా, బొప్పాయి, నేరేడు, అరటి, కొబ్బరి, మునగ, నిమ్మ, బొత్తాయి వంటి రకాలు ఉన్నాయి. వీటిలో కూడా అనేక జాతులకు చెందిన మొక్కలు పలు నర్సరీల్లో లభిస్తున్నాయి. ఆయా మొక్కలు నాటిన ఆరు నెలల నుంచి ఏడాదికే కాపునిస్తున్నాయి. కొబ్బరిలో తూము కట్టినప్పటి నుంచి నేలకు కొబ్బరి గెలలు తగిలేలా కాపు వస్తున్నాయి. గ్రామీణ ప్రాంత రైతులు పొలం గట్లు, కాలువ గట్లు, చెరువు గట్లతో పాటు వారికి ఉన్న పెరటి, కల్లాంలోని ఖాళీ స్థలాల్లోనూ ఆయా మొక్కలు నాటుతున్నారు. పట్టణాల్లో నివాసం ఉంటున్న వారు వారి పెరటి మొక్కలుగా రకానికి ఒక మొక్కను పెంచుకుంటున్నారు. ఒకప్పటి కంటే ఇప్పుడు ఒక్కో ఇంటి నుంచి ఒక పండ్ల మొక్కనైనా పెంచుకుందామని ఆసక్తి చూపుతున్నారు.

ఉచితంగా ఉపాధి హామీ మొక్కలు

పండ్ల మొక్కలు పెంచేందుకు ఆసక్తి ఉన్న రైతులను గుర్తించి ఉపాధి హామీ పథకం ద్వారా ప్రతి ఏడాది పండ్ల మొక్కలను ఆ పథకం ద్వారా ఉచితంగా సరఫరా చేస్తున్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా హైబ్రీడ్ జామ, మామిడి, సపోటా, నిమ్మ, కొబ్బరి, మునగ, బొప్పాయి వంటి జాతులకు చెందిన మొక్కలు సరఫరా చేస్తున్నారు. పండ్ల మొక్కల పెంపకం ప్రోత్సాహంలో భాగంగా జాబు కార్డు కలిగి ఉన్న రైతులకు మూడు నుంచి ఐదు మొక్కలు ఉచితంగా పంపిణీ చేస్తున్నారు.



తక్కువ వయసులో కాపునిచ్చే కొబ్బరి



చేతికి అందినంత ఎత్తులోనే సపోటా

పండ్ల మొక్కల పెంపకానికి ప్రాధాన్యత



పండ్ల మొక్కలు పెంచేందుకు ప్రాధాన్యత ఇస్తున్నాం. రైతులకు అదనపు ఆదాయం సమకూరాలనే ఆశయంతో ఆయా రకాల పండ్ల మొక్కలు పెంచేందుకు ఆసక్తి ఉన్న రైతులను గుర్తించి వారికి మొక్కలు పంపిణీ చేస్తున్నాం. అధిక విస్తీర్ణంలో పండ్ల మొక్కలు సాగు చేసే రైతులను ప్రోత్సహిస్తున్నాం.
– టి.విమల, ఉద్యాన అధికారి, ఎల్.ఎన్.పేట

పట్టపగలు నడిరోడ్డుపై హత్యాయత్నం

శ్రీకాకుళం క్రైమ్ :

శ్రీకాకుళంలోని రిమ్స్ కూడలి.. సమయం ఉదయం 10.48.. రోడ్డుపై పెద్దగా మనుషులు లేరు.. దారంతా ఎండలకు నిశ్శబ్దమై ఉంది. అదే సమయంలో ఆ దారిలో ఓ బైక్‌పై వెళ్తున్న వారిని వెనుక నుంచి మరో బైక్‌పై వచ్చిన వ్యక్తి అడ్డగించాడు. బైక్ ఆగగానే.. చేతిలో పెద్ద వేట కత్తి తీసుకుని నరకడానికి ప్రయత్నించాడు. యువకుడు పారిపోతుండగా అతని వెనుక కత్తి పట్టుకుని పరుగెత్తుతూ భయోత్పాతం సృష్టించాడు. శుక్రవారం జిల్లా కేంద్రంలో జరిగిన ఈ ఘటన స్థానికులను ఆందోళనకు గురి చేసింది. రెండో పట్టణ పోలీసులు, బాధితుడు తెలిపిన వివరాల్లోకి వెళ్తే..

నగరంలోని దమ్మల రెల్లి వీధికి చెందిన నల్లపిల్లి గౌరీశంకర్ (26)కు వేరే వ్యక్తి రూ.2 వేలు ఇవ్వాల్సి ఉండగా.. అవి కలెక్ట్ చేసుకోవడానికి తన బావ విజయ్‌కుమార్‌తో కలిసి బలగ రిమ్స్ రోడ్డుకు స్కూటీపై వచ్చారు. రోడ్డుపై వెళ్తుండగా మండలవీధి సమీప రామ్ కాలనీ యువకుడు బొమ్మాళి గిరి బండి ఆపమంటూ వెనుక నుంచి కేకలు వేశాడు. వారు మలుపు తిప్పేలోగా తన బండిని కిందపడేసిన గిరి తన వెంట తెచ్చుకున్న వేట కత్తి తీసి విజయ్ వెనుక కూర్చొని ఉన్న గౌరీశంకర్‌పై దాడికి యత్నించాడు. పెనుగులాటలో స్కూటీ, మొబైళ్లు కిందపడిపోయాయి. ఈ హఠాత్పరిణామం నుంచి తేరుకున్న గౌరీశంకర్ పరుగులు పెట్టాడు.. అతని వెంటే కత్తి పట్టుకున్న గిరి మరింత స్పీడుగా పరిగెత్తాడు.. వీరి వెంబడే విజయ్ కూడా స్కూటీపై వెళ్లాడు. వంద మీటర్లు వెళ్లేసరికి కత్తి పట్టుకున్న గిరికి పారిపోతున్న గౌరీశంకర్ దొరికిపోయాడు. దీంతో కత్తితో మెడ నరకడానికి ప్రయత్నించాడు. ఈ ప్రయత్నంలో గౌరీ శంకర్‌కు గాయాలయ్యాయి. ఇవన్నీ కళ్ల ముందే జరగడంతో జనాలు భయాందోళనకు గురై ఎవరూ దగ్గరకు వెళ్లే సాహసం చేయలేదు. ఈ లోగా వెనుక స్కూటీపై వచ్చిన విజయ్‌కుమార్ అడ్డుపడి కత్తితో ఉన్న గిరిని పట్టేయడంతో గాయాలపాలైన గౌరీశంకర్ తప్పించుకుని బలగ కూడలికి వచ్చి ఆటోలో పారిపోయాడు. అనంతరం గిరి దర్జాగా రోడ్డుపై నడుచుకుంటూ వెళ్లి తన బైక్ తీసుకుని రిమ్స్ వైపుగా వెళ్లిపోయాడు. ఘటన అంతా దగ్గరలో పోలీసులు ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలోనే కాక దగ్గరలో ఉన్న కేకే రాయల్ రెసిడెన్సీ సీసీ కెమెరాల్లో నిక్షిప్తమయ్యాయి. సచివాలయం సమీపంలో ఘటన జరగడంతో అక్కడి సిబ్బంది పోలీసులకు సమాచారం అందజేశారు.



కత్తితో రోడ్డుపై నడుస్తున్న బొమ్మాళి గిరి


పాత కక్షలే కారణమా..



రిమ్స్‌లో చికిత్స పొందుతున్న గౌరీశంకర్

ఆటోలో తప్పించుకుని పారిపోయిన గౌరీశంకర్ నేరుగా రెండో పట్టణ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశాడు. గౌరీశంకర్‌కు గాయాలుండటంతో పోలీసులు రిమ్స్ ఆస్పత్రికి వెళ్లి చికిత్స చేయించుకోమన్నారు. రిమ్స్‌లో చికిత్స చేసుకుంటున్న గౌరీశంకర్‌ను, అతని బంధువులను ఘటనపై వివరాలు అడగ్గా.. బొమ్మాళి గిరి చెల్లి అనిత తన క్లాస్‌మేట్ అని, అనిత ఐదేళ్ల కిందట ఆత్మహత్య చేసుకుందని తెలిపాడు. ఆమె చనిపోవడానికి తానే కారణమని అప్పట్లో కేసు కూడా పెట్టారని, కానీ కోర్టులో కేసును కొట్టేశారని గౌరీశంకర్ తెలిపాడు. అప్పటి నుంచి గిరి తనపై కక్ష పెంచుకున్నాడని, ఈ రోజు దాడికి దిగాడని తెలిపాడు. ప్రస్తుతం రిమ్స్‌లో గౌరీశంకర్ చికిత్స పొందుతున్నాడు.

జాతీయ స్కాలర్‌షిప్‌కు నేహా ఎంపిక



గురువు శ్రీకాంత్‌తో నేహాపట్నాయిక్

శ్రీకాకుళం కల్చరల్: భారత ప్రభుత్వం కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ ద్వారా ఇచ్చే సీసీఆర్టీ స్కాలర్ షిప్‌కు కూచిపూడి నాట్య విభాగంలో శ్రీకాకుళం పట్టణానికి చెందిన నేహా పట్నాయిక్ ఎంపికైనట్లు నాట్యగురువు రఘుపాత్రుని శ్రీకాంత్ ఓ ప్రకటనలో తెలిపారు. ఎంతో ప్రతిష్టాత్మకమైన ఈ స్కాలర్ షిప్ కోసం గత ఏడాది అక్టోబర్‌లో హైదరాబాద్ సీసీ ఆర్టీ సెంటర్‌లో నిర్వహించగా పాల్గొన్నట్లు పేర్కొన్నారు. శ్రీకాకుళం నాట్య చరిత్రలో ఇప్పటి వరకు కేవలం నలుగురు విద్యార్థులు మాత్రమే ఈ జాతీయ స్కాలర్ షిప్‌కు ఎంపిక కాగా ఆ నలుగురు విద్యార్థులు తమ సంస్థకు చెందినవారని శ్రీకాంత్ తెలిపారు. నేహా బాలికల ఉన్నత పాఠశాలలో చదువుతోందని తెలిపారు. ఈ ఎంపికపై స్కూల్ హెచ్ఎం లక్ష్మీ, ఇతర ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు, పలువురు నాట్య గురువులు, నాట్యరంగ సంస్థలు, వివిధ రంగాలకు చెందిన కళాకారులు నేహా పట్నాయిక్‌ను అభినందించారు.

'చేగువేరా స్ఫూర్తితో విద్యార్థులు పోరాడాలి'



చేగువేరా చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు తదితరులు

ఆమదాలవలస: చేగువేరా స్ఫూర్తితో విద్యార్థులు పోరాటాలకు సన్నద్ధం కావాలని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు పిలుపునిచ్చారు. శుక్రవారం పురపాలక సంఘంలోని చింతాడ పరిధిలో ఉన్న జీఎల్ ఫంక్షన్ హాల్‌లో ఎస్ఎఫ్ఐ విద్యా వైజ్ఞానిక శిక్షణ తరగతుల కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా చేగువేరా 96 జయంతి సభలో పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన ఎస్ఎఫ్ఐ ప్రతినిధులు చేగువేరాకు జేజేలు పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేగువేరా జీవితాన్ని విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కె.ప్రసన్న కుమార్ కార్యదర్శి ఎ.అశోక్, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పావని, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు చందు, హరీష్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

పోలీసు లాంఛనాలతో హెడ్‌కానిస్టేబుల్ అంత్యక్రియలు



లక్ష్మారెడ్డి అంత్యక్రియల్లో పోలీసుల గౌరవ వందనం

పోలాకి: శ్రీకాకుళం రెండోపట్టణ పోలీస్ స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తూ సీఎం ప్రమాణ స్వీకార బందోబస్తు విధుల్లో పాల్గొని తిరుగు ప్రయాణంలో మృతి చెందిన ఆబోతుల లక్ష్మారెడ్డి అంత్యక్రియలు ఆయన స్వగ్రామం పల్లిపేటలో శుక్రవారం పోలీస్ వందనంతో జరిగాయి. ఎస్పీ జీఆర్ రాధిక ఆదేశాలతో లక్ష్మారెడ్డి భార్య చంద్రకళావతికి పోలీస్ డెత్ రిలీఫ్ ఫండ్ నుంచి రూ.లక్ష అందించారు. ఎస్ఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో సిబ్బంది అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

ఆటో బైక్ ఢీ.. ఇద్దరికి గాయాలు

మెళియాపుట్టి: మండలంలోని జోడూరు గ్రామ సమీపంలో శుక్రవారం బైక్–ఆటో ఢీకొన్నాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం సాయంత్రం పాతపట్నం మండలం సిద్ధమణుగు గ్రామానికి చెందిన పడాల గణపతి ద్విచక్రవాహనంపై జాడుపల్లి గ్రామం నుంచి మెళియాపుట్టి వస్తున్నాడు. చాపర గ్రామానికి చెందిన చంద్రభూషణ్ తన ఆటోపై జాడుపల్లి వెళ్తున్న సమయంలో.. జోడూరు గ్రామం వద్ద ఈ రెండు వాహనాలు ఢీకొన్నాయి. గణపతికి తలపై బలమైన గాయమైంది. ఆటో డ్రైవర్ కూడా దెబ్బలు తగలడంతో 108 వాహనంపై వారిని టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

జామియా మసీదు అభివృద్ధిపై ప్రణాళికలు



జామియా మసీదు కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న మైనారిటీ వెల్ఫేర్ అధికారి జాన్

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళంలోని అతి పురాతనమైన జామియా మసీదు అభివృద్ధి కోసం ప్రణాళికలు తయారు చేస్తున్నట్లు జిల్లా మైనారిటీ వెల్ఫేర్ అధికారి ఆర్ఎస్ జాన్ తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆయన శుక్రవారం జామియా మసీదును సందర్శించారు. ఈ సందర్భంగా జామియా మసీదు కమిటీ సభ్యులతో చర్చించి వారి సహకారంతో అభివృద్ధి కోసం ఒక ప్రణాళికను తయారు చేశారు. మసీదులో నమాజు చేసుకునే ప్రాంతంలో చేపట్టే అభివృద్ధి పనులు, మౌలిక వసతుల పెంపు, అవసరమైన అదనపు గదుల నిర్మాణం తదితర అంశాలపై చర్చించారు. మసీదు కమిటీ తెలిపిన అభివృద్ధి పనులను కలెక్టర్ ముందు ఉంచి, శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్ సహకారంతో అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపడతామని జాన్ తెలిపారు. ఈ సందర్భంగా మైనారిటీ వెల్ఫేర్ అధికారిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జామియా మసీదు కమిటీ అధ్యక్షుడు మహిబుల్లాఖాన్, గౌరవ అధ్యక్షుడు అమిరుల్లా బేగ్, సలీమ్‌ఖాన్, ఉపాధ్యక్షులు సర్ఫరాజ్, కార్యదర్శి అక్బర్ భాషా, ఎగ్జిక్యూటివ్ సభ్యులు ఫుర్కుఖాన్, సయ్యద్‌షఫీ, వక్ఫ్ ఇన్‌స్పెక్టర్ సారిక్, జూనియర్ అసిస్టెంటు రియాజ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ఆదిత్యలో అంతర్జాతీయ భాషలపై శిక్షణ కోర్సులు



మాట్లాడుతున్న ఆదిత్య కళాశాల డైరెక్టర్ వీవీ నాగేశ్వరరావు

టెక్కలి: ఇంజినీరింగ్, ఇతర కోర్సులను అభ్యసిస్తున్న విద్యార్థులకు విదేశాల్లో ఉద్యోగ అవకాశాల కోసం టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో అంతర్జాతీయంగా చైనా, జపాన్, జర్మనీ, కొరియా తదితర ఫారిన్ లాంగ్వేజ్‌లపై శిక్షణ కోర్సులను అందజేస్తున్నట్లు కళాశాల డైరెక్టర్ వీవీ నాగేశ్వరరావు వెల్లడించారు. శుక్రవారం కళాశాలలో మీడియా సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో కళాశాలలో ఐతమ్ రైజ్ పేరుతో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసి దాని ద్వారా స్టూడెంట్ ఇన్నోవేషన్ ప్రోగ్రామ్స్, స్టార్టప్‌లను అభివృద్ధి చేసుకునేందుకు కృషి చేస్తున్నా మని ఆయన పేర్కొన్నారు. అలాగే ఉద్యోగాలు, వ్యాపారాలు చేసుకునే వారి కోసం ప్రత్యేకంగా బీటెక్, ఎంబీఏ కోర్సులను అందజేయడానికి ప్రభుత్వం ప్రత్యేక అవకాశాలు కల్పించిందని, దీని వల్ల ఒక వైపు ఉద్యోగాలు, వ్యాపారాలు చేస్తూ మరో వైపు బీటెక్, ఎంబీఏ కోర్సులను పూర్తి చేయవచ్చునని డైరెక్టర్ తెలిపారు. దీనిపై త్వరలో విధి విధానాలు తెలియజేస్తామని పేర్కొన్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచి కొత్త కోర్సులను అమలు చేసేందుకు ఏఐసీటీఈ అనుమతులు మంజూరు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. కంప్యూటర్ సైన్స్ విభాగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్ స్ట్రక్చరల్ ఇంజినీరింగ్, ఎంబీఏ లో కొత్త కోర్సులను అందజేస్తున్నట్లు తెలిపారు. అలాగే డిప్లమా కోర్సుల్లో ఈ ఏడాది నుంచి కంప్యూటర్ సైన్సు కోర్సులకు సాంకేతిక బోర్డు అనుమతి మంజూరు చేసినట్లు డైరెక్టర్ నాగేశ్వరరావు తెలిపారు. సుమారు 32 ప్రముఖ కంపెనీల ద్వారా సుమారు 620 మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించినట్లు తెలిపారు. అలాగే ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అభివృద్ధిలో భాగంగా ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసి వాటి ద్వారా జిల్లా వ్యాప్తంగా ఇన్నోవేషన్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చెట్టు కూలి ఒకరు మృతి



మృతుడు రమణ (ఫైల్)

జి.సిగడాం: మండలంలోని సేతుభీమవరం పంచాయతీలో గల పెనసాం గ్రామంలో చెట్టు కూలిపోవడంతో అదే గ్రామానికి చెందిన గేదెల రమణ(39) అనే వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. పొలం చూసేందుకు వెళ్లి ఇంటికి వస్తున్న సమయంలో ఈ సంఘటన చోటు చేసుకుంది. శుక్రవారం మధ్యాహ్నం ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షానికి గ్రామ సమీపంలో గల తంగిటి చెట్టు ఒక్కసారిగా కూలిపోయింది. అదే సమయంలో రమణ పొలం నుంచి ఇంటికి వస్తున్నాడు. చెట్టు అమాంతం ఆయనపై పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. రమణ మృతి వార్త విన్న భార్య కన్నీరుమున్నీరయ్యారు.